సాక్షి
వికారాబాద్

సోమవారం ၊ 10 ၊ ఫిబ్రవరి ၊ 2025



మామిడిలో సస్యరక్షణ

ప్రతికూల వాతావరణంతో పాటు చీడపీడల దాడులతో మూడేళ్లుగా మామిడి రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. 8లో▸



కల్యాణం.. కమనీయం

తాండూరు మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. 8లో▸



వర్గీకరణ నివేదిక అశాస్త్రీయం

ఎస్సీ వర్గీకరణ నివేదిక అశాస్త్రీయంగా ఉందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బందయ్య ఆరోపించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్



వేంకటేశ్వర స్వామి పూజలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో ఓ ఇంట్లో నిర్వహించిన వేంకటేశ్వర కల్యాణానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. భక్తి మార్గంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.పది లక్షలు



పట్నం మహేందర్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న శివ మాలధారణ స్వాములు

తాండూరు: కోటేశ్వర ఆలయ జీర్ణోద్ధరణకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాత తాండూరుకు చెందిన శివ మాలధారణ స్వాములు శివరాజ్, ఉప్పరి నర్సింలు, భీము, మల్లపాటి రవికుమార్, వీరన్న, గిరిజాపురం సాయికుమార్ తదితరులు నగరంలోని పట్నం మహేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి కలిశారు. ఈ నెల 13న పాత తాండూరులో కోటేశ్వరాలయంలో శివ పార్వతుల కల్యాణం, 26న లక్ష దీపార్చన కార్యక్రమాలకు హాజరవ్వాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతాభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు.

వ్యవసాయ ప్రదర్శనతో రైతులకు మేలు

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

ధారూరు: నగరంలోని హైటెక్ సిటీలో నిర్వహించిన కిసాన్ వ్యవసాయ ప్రదర్శన రైతులను ఆకట్టుకుంటోందని హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డైరెక్టర్లతో కలిసి ఈ ప్రదర్శనను తిలకించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. కూలీల కొరత నుంచి బయట పడేందుకు చిన్న మిషన్లతో విత్తనాలు నాటడం, డ్రోన్లతో రసాయనాల పిచికారీ తదితర విషయాలు వివరిస్తున్నారని చెప్పారు. సంఘం పరిధిలోని రైతులను చైతన్యం చేసి ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు.

రేషన్ దరఖాస్తుదారుల వెరిఫికేషన్



ముద్దాయిపేటలో దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి సర్వే చేస్తున్న ఆర్‌ఐ సాయిచరణ్

యాలాల: రేషన్‌కార్డు దరఖాస్తులను అధికారులు ఆదివారం దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ సాయిచరణ్ మాట్లాడుతూ రేషన్ కార్డు కోసం గ్రామంలో వంద దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో కొత్త సభ్యుల చేర్పు, కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారు సైతం ఉన్నారని చెప్పారు. దరఖాస్తుదారుల ఇంటికి నేరుగా వెళ్లి లబ్ధిదారుల ఎంపిక చేపడతున్నామని వివరించారు.

గురుమూర్తి తల్లి, సోదరి, సోదరుడిపై కేసు నమోదు

మీర్‌పేట: మీర్‌పేట ఠాణా పరిధిలో మాజీ సైనిక ఉద్యోగి గురుమూర్తి తన భార్యను హత్య చేసిన కేసులో పోలీసులు అతడి తల్లి, సోదరి, తమ్ముడిపై కూడా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే గురుమూర్తి ఏ1గా ఉండగా, తాజాగా పోలీసులు ఏ2గా సోదరి సుజాత, ఏ3గా తల్లి సుబ్బలక్ష్మమ్మ, ఏ4గా సోదరుడు కిరణ్‌ను చేర్చారు. హత్య కేసులో వీరి ప్రమేయం లేదని.. కొంత కాలంగా మృతురాలు వెంకట మాధవిని అదనపు కట్నం విషయంలో భర్తతో పాటు వీరు ముగ్గురు మానసికంగా వేధింపులకు గురిచేశారని మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని సీఐ నాగరాజు తెలిపారు.

నేతల హస్తం!

ఫైనల్ జాబితా రూపకల్పనలో రాజకీయ జోక్యం

- సంక్షేమ పథకాల కోసం ఆశావహుల ఆరాటం
- ఆందోళనతో అధికార పార్టీ నేతల చుట్టూ ప్రజల ప్రదక్షిణ
- ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం పెరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు, ప్రజలు అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండేలా చూడాలని స్థానిక నాయకులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు స్థానిక సంస్థల ఎన్నికలో అధికార పార్టీకి మద్దతు తెలపాలని.. పార్టీ తీర్థం పుచ్చుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితా సిద్ధం చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం అవుతోంది. తొలి జాబితాలో తమ పేర్లు రావాలని అర్హులు, ప్రజలు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అధికార పార్టీ నాయకుల జోక్యంతో లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నారని.. దీంతో అనర్హులకు పథకాలు అందుతున్నాయని.. ఫలితంగా అర్హులకు అన్యాయం జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీలు, 585 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇంధిరమ్మ ఇళ్లకు దాదాపు 2.80లక్షల మంది అర్హుల జాబితా సిద్ధమైనట్లు అధికారులు ప్రకటించారు.

వందల్లో అర్హులు

ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగు పథకాలను ప్రారంభించారు. ప్రతీ మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసి ఆగ్రామంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నిర్వహించిన గ్రామ సభల్లో అర్హుల జాబితాను గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపించారు. గ్రామానికి పది నుంచి 15 వరకు ఇళ్లు రానుండడం.. అర్హులు వందల్లో ఉండడంతో తొలిజాబితాలోనే తమకు చోటు కల్పించాలంటూ అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఎంపికైన వారి పేర్లను సైతం సభలో ప్రకటించారు. అనర్హులు ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల సమయం కావడంతో అధికార పార్టీ నాయకులు అడ్డు చెప్పడం లేదు. కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డులో పేర్లు మార్పుచేర్పులపై లబ్ధిదారులు అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సంక్షేమాల కోసం చేతి వాటం

ప్రభుత్వం ఒకేసారి నాలుగు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో వాటి కోసం చేతివాటం ప్రదర్శిస్తున్నారనే చర్చలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. జాబితాలో పేరు వచ్చిన వారు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారని.. గ్రామస్థాయిలో రూ.లక్ష వసూలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు: రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో శ్రీ వేదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. అనంతరం మంత్రి.. జూపల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

ఆ దీక్షను బహిష్కరించండి

- నియోజకవర్గాన్ని దత్తత తీసుకున్న కేటీఆర్ చేసేందేమీ లేదు
- హామీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి
- కొడంగల్ ప్రాంత అభివృద్ధికి రూ.6,128 కోట్ల నిధులు
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

కొడంగల్ రూరల్: బీఆర్‌ఎస్ నిర్వహించ తలపెట్టిన రైతు నిరసన దీక్షను రైతులు బహిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పట్టణంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో పార్టీ ముఖ్యనేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌ఆర్ మాట్లాడుతూ.. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మహబూబ్‌నగర్‌ను, మాజీ మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకున్నామని ప్రగల్భాలు పలికి చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రాజెక్టులను తమ ప్రాంతాలకు తరలిస్తూ ఇక్కడి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సురేశ్ అనే వ్యక్తిని రెచ్చగొట్టి... అధికారులపై దాడికి ఉసిగొల్పి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్య, ఉపాధి, ఉద్యోగ, తాగు, సాగు నీటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రూ.6,128 కోట్ల నిధులను కేటాయించి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కొడంగల్ ప్రాంతానికి సాగునీటికి సంబంధించి నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం, వికారాబాద్–కృష్ణా రైల్వేలైన్ పనులకు సర్వే కొనసాగుతోందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, రఘువర్ధన్‌రెడ్డి, కృష్ణంరాజు, శంకర్‌నాయక్, సోమశేఖర్, ఆసిఫ్‌ఖాన్, ఎస్ఎం.గౌసన్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో హైడ్రా పంజా

అక్రమ కట్టడాల కూల్చివేత

తుర్కయంజాల్: అబ్దుల్లాపూమెట్ మండలం కోహెడలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆదివారం పంజా విసిరింది. అక్కడ వెలిసిన అక్రమ కట్టడాలను అధికారులు కూల్చేశారు. సర్వే నంబర్ 951, 952ల్లోని గ్రామపంచాయతీ లేఔట్‌లో తమ ప్లాట్లను ఎస్.బాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించారని, రహదారులు లేకుండా అడ్డుగోడలుగా కట్టారని రాధే ధామం లే ఔట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పలువురు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా అధికారులు పలు పత్రాలను పరిశీలించారు. 1986లో భూయజమానులు కె.రాములు, పెద్దయ్య, ఈసయ్య పంచాయతీ లేఔట్ వేసినట్టు నిర్ధారించారు. బాల్‌రెడ్డి ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఫాం హౌస్ నిర్మించడంతో పాటు లే ఔట్‌లోని పలు ప్లాట్లను సొంతం చేసుకుంటూ అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు వెల్లడైంది. దీంతో అన్ని పత్రాలతో తమ కార్యాలయంలో హాజరు కావాలని ఇరుపక్షాలకు హైడ్రా నోటీసులు జారీ చేసింది. శనివారం వారు హాజరు కాగా రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించింది. ఫామ్‌హౌస్, షెడ్, కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవంటూ తుర్కయంజాల్ మున్సిపల్ అధికారుల స్పష్టం చేశారు. ప్లాట్లను తమకు అమ్మిన తర్వాత బాల్‌రెడ్డి ఈ భూమిని తాను కొన్నట్టు రికార్డులు సృష్టించారని ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. హైడ్రా ఇరుపక్షాలతో పాటు రెవెన్యూ, మున్సిపల్ అధికారులను విచారించి బాల్‌రెడ్డి నిర్మించిన ఫాంహౌస్‌తో పాటు ప్రహరీ, ఫెన్సింగ్ కూల్చివేతకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆదివారం అక్రమ కట్టడాలను కూల్చేశారు.



అర్హత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

‘మెరిట్’లో మెరిసారు

- ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు 77 మంది అర్హత
- తల్లదండ్రులు, ఉపాధ్యాయుల హర్షం
- అత్యధికంగా దోమ, రెండోస్థానంలో బొంరాస్‌పేట
- నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేల ఉపకార వేతనం

బొంరాస్‌పేట: చదువులో పేద విద్యార్థులకు ఆర్థికభారం అడ్డు తప్పించేందుకు ప్రతీ ఏడాది జాతీయ స్థాయిలో నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ సర్చ్ (ఎన్‌ఎంఎంఎస్) ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నారు. ఫలితంగా దేశ వ్యాప్తంగా 5 వేల మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందుతోంది. ఇందులో ఎంపికైన ప్రతీ విద్యార్థికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతోంది. 2024–25 విద్యాసంవత్సరంలో నిర్వహించిన అర్హత పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా 77 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి వెరిఫికేషన్ జాబితాలో చేరారు. అందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, జిల్లా విద్యాధికారి సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితాల్లో విద్యార్థుల హవా

ఈ పరీక్షకు దారిద్ర రేఖకు దిగువన ఉన్న తెల్లరేషన్ కార్డుదారుల కుటుంబాల విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ అర్హత పరీక్ష రాశారు. అర్హత సాధించిన వారు తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు వరకు ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

అర్హత సాధించినవారు

మండలం	విద్యార్థులు
దోమ	15
బొంరాస్‌పేట	12
పూడూరు	10
కుల్కచర్ల	08
నవాబ్‌పేట	07
వికారాబాద్	06
యాలాల	02
దౌల్తాబాద్	02
చౌడాపూర్	02
పెద్దేముల్	01
బషీరాబాద్	01
బంట్వారం	01
పరిగి	01
పెద్దేముల్	01
ధారూర్	01
పరిగి	01
కొడంగల్	01
దుద్యాల	01
బాలురు	37
బాలికలు	40
మొత్తం	77

ఆనందంగా ఉంది



మా పాఠశాల నుంచి ఈ ఉపకారవేతకానికి అర్హత సాధించడంలో నేను మొదటి విద్యార్థిని అవడం ఆనందంగా ఉంది. నాపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పలు రకాల టెస్టులు రాయించారు. సలహాలు, పరీక్ష విధానం వంటి మాదిరి పరీక్షలు నిర్వహించారు.

– వర్షిని, 8వ తరగతి, హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్

ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం



నవంబర్ నుంచి ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు చెప్పాం. పక్షానికోసారి పరీక్షలు నిర్వహణ, మెంటలెబిలిటీ పై నాతోటి టీచర్లంతా పోటీపరీక్షలకు అవగాన కల్పించారు. విద్యార్థులను వెన్నంటి ప్రోత్సహించాం.

– చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు, బొంరాస్‌పేట జెడ్పీహెచ్ఎస్

ఉపాధ్యాయుల చొరవ నచ్చింది



ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ ఉంది. పాఠశాల సమయానికి ముందు, తర్వాత, ప్రతి రోజు బోధన. ఈ ఏడాది గతం కన్నా మించి అర్హత సాధించారు. అన్ని పరీక్షల్లో పరీక్షా విధానంపై ప్రత్యేక అవగాహన, ఉపాధ్యాయుల చొరవతో తల్లదండ్రులకు ఆర్థిభారం తగ్గుతుంది.

– వెంకటయ్య, ఎంఈఓ, దోమ

సంఖ్య పెరగడం గర్వకారణం



విద్యార్థుల్లో పోటీ పరీక్షలపై అవగాహన, చైతన్యం పెరిగింది. ఈ ఎన్‌ఎంఎంఎస్ పట్ల జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం. పేద విద్యార్థులకు ఇది చాలా మంచి స్కీమ్. జాతీయస్థాయి పథకంలో జిల్లా విద్యార్థుల సంఖ్య పెరగడం గర్వకారణం.

– రేణుకాదేవి, డీఈఓ, వికారాబాద్

నేడు రైతు నిరసన దీక్ష

- హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హామీలు విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్‌రెడ్డి

కొడంగల్ రూరల్: నియోజకవర్గంలోని కోస్గి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న రైతు నిరసన దీక్షను విజయవంతం చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ నాయకులు అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి నివాసంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోస్గి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని.. ఎకారకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారం దక్కించుకునేందుకు అమలుకు సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులకు పెట్టుబడి సాయం సాగుకు ముందే రైతు ఖాతాల్లో నగదు జమయ్యేదని.. ప్రస్తుతం రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, పెంచిన పెన్షన్ అమలకు నోచుకోవడం లేదని.. పథకాల అమలు డిమాండ్‌తో చేపడుతున్న నిరసన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు, రైతులు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుసూదన్‌రావు, మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వచ్ఛందంగా హాజరు కావాలి

బొంరాస్‌పేట: బీఆర్‌ఎస్ రైతుదీక్షకు నియోజకవర్గంలోని రైతులంతా స్వచ్ఛందంగా రావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని తుంకిమెట్లలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో చర్చించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పలువురు పార్టీ ముఖ్య నేతలతో కలిసి మధ్యాహ్నం పరిగి నుంచి తుంకిమెట్లకు రానున్నారు. తుంకిమెట్లలో పార్టీ జెండావిష్కరణ చేస్తారని చెప్పారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని నాందార్‌పూర్, లగచర్ల గేట్, హకీంపేట మీదుగా కోస్గిలో చేపడుతున్న రైతు దీక్షలో పాల్గొంటారని చెప్పారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కౌశిక్‌రెడ్డి, బాల్కసుమన్ తదితర ముఖ్య నేతలు హాజరవుతారని చెప్పారు. శాంతియుతంగా చేపట్టిన రైతుదీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి, మహేందర్‌రెడ్డి, శేరి నారాయణ రెడ్డి, నెహ్రూనాయక్, తిరుపతయ్య, మల్లేశ్‌గౌడ్, అవినాశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ఉత్తమ వైద్యుడిగా జయప్రసాద్



జయప్రసాద్‌కు అవార్డు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

తాండూరు: వైద్య వృత్తిలో ఉత్తమ సేవలు అందించినందుకు డాక్టర్ జయప్రసాద్‌కు రాష్ట్రస్థాయిలో పురస్కారం దక్కింది. శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు వరించింది. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ డాక్టర్ జయప్రసాద్‌కు అవార్డు అందజేశారు.

సమష్టి కృషితో ఆలయ జీర్ణోద్ధరణ

15 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



గోకఫసల్‌వాద్‌లో నిర్మించిన శివాలయం

దౌల్తాబాద్: గ్రామస్తులంతా చేయి చేయి కలిపారు. వందేళ్ల ఆలయానికి జీర్ణోద్ధరణ చేశారు. సుమారు రూ.కోటి భక్తుల విరాళాలతో మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో శివాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన స్థపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు. అలాగే ఆలయంలో నంది విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆలయంలో ధ్వజస్తంభం కూడా నిర్మించారు. ఆలయాన్ని పున:నిర్మించాలని సంకల్పించి గతేడాది మార్చి నెలలో భూమి పూజ చేశారు. ఏడాదిలోపే ఈ నెల 15న ఆలయం పున:ప్రతిష్ఠాపన జరగనుంది. ఈనెల 15నుంచి 17 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పున:ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

సీసీ కెమెరాలకు చిక్కిన దొంగ



కెమెరాలో రికార్డయిన దృశ్యాలు

తాండూరు: రెండిళ్లలో చోరీకి పాల్పడిన దొంగను సీసీ కెమెరాలో పట్టణ సీఐ సంతోష్ ఆదివారం గుర్తించారు. వరుస దొంగతనాలను చేసింది సదరు వ్యక్తే అని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. గతంలో జడ్చర్ల పట్టణంలో ఇళ్లలో చోరీకి పాల్పడిన సమయంలో ఈ దొంగ చాయాచిత్రాలు సీసీ కెమెరాలో గుర్తించారు. అదే వ్యక్తి రెండు రోజుల క్రితం తాండూరు పట్టణంలో సంచరిస్తుండడంతో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో పట్టణ సీఐ నిందితుడి ఆచూకీ కనుక్కొనేందుకు ఫొటోలు విడుదల చేశారు. మరోవైపు పోలీసు బృందంతో కలిసి దర్యాప్తు వేగంగా చేపడుతున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

- పూత దశలో జాగ్రత్తలు ముఖ్యం
- వికారాబాద్ ఉద్యాన అధికారి అక్షితరెడ్డి



నవాబుపేట: ప్రతికూల వాతావరణంతో పాటు చీడపీడల దాడులతో మూడేళ్లుగా మామిడి రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. పూత దశ నుంచే యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాలను నివారించుకొని దిగుబడులు పెంచుకోవచ్చనంటున్నారు వ్యవసాయ అధికారులు. ప్రస్తుతం మామిడి చెట్లు పూత కొస్తున్నాయి. వికారాబాద్ డివిజన్ పరిధిలోని వికారాబాద్, మోమిన్‌పేట, మర్పల్లి, నవాబుపేట, ధారూర్, కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో 2000కు పైగా ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ దశలో మామిడి తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వికారాబాద్ డివిజన్ ఉద్యానవన అధికారి అక్షితరెడ్డి వివరించారు.

యాజమాన్య పద్ధతులు

జూన్, జులై నెలలో సక్రమంగా ఎరువులు వేయలేక పోయిన వారు పిందె దశలో ఒక చెట్టుకు అర కిలో యూరియా, అరకిలో పొటాష్ వేసుకోవాలి. నీటి వసతి లేని వారు 15 రోజుల వ్యవధిలో 1శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. మొగ్గలు బయటికి వచ్చే వరకు నీటి తడులు పెట్టరాదు. పూత ఆలస్యమైనా తోటల్లో కాయ పెరుగుదల సమయంలో తప్పనిసరిగా డ్రిప్ ద్వారా నీరు పెట్టాలి. ప్రస్తుతం మొగ్గ దశలో ఉన్న తోటల్లో క్లోరిపైరిపాస్, నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు కలిపి పిచికారీ చేసినట్లైతే తేనెమంచు, బూడిద తెగులు రాకుండా నివారించవచ్చు. మొగ్గ తొందరగా విచ్చుకోవడానికి పూత, కాడ పొడవుగా పెరగడానికి పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి. నీటి వసతి ఉన్నవారు మొగ్గ పగిలే దశ నుంచి నీరు పెట్టవచ్చు. తప్పనిసరిగా డ్రిప్ ద్వారానే నీరు పెట్టాలి. కాలువల ద్వారా నీరు పారిస్తే రోగకారక శిలీంద్రాలు ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు సోకే ప్రమాదం ఉంటుంది.



నారెగూడలో మామిడి పూత

చీడ పీడల నివారణ

పూత దశలో బూడిద తెగులు నివారణకు హెక్సకోనాజోల్ 2 మి.లీ లేదా బెల్‌టాన్ 1 గ్రాములో ఏదైనా ఒక దాన్ని లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత ఆలస్యంగా వచ్చినప్పుడు కాయ పెరుగుదల దశలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి పొడి వాతావరణం ఉంటుంది. కాబట్టి రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరిచే అవకాశం ఉంది. తేనే మంచు పురుగు ఉధృతి ఎక్కువ అయినప్పుడు డైమిథోయేట్ 2మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలి. తామర పురుగులు అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి ఫిప్రోనిక్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. నల్లి నివారణకు లీటరు నీటికి డైకోఫాల్‌ను 2.5 మి.లీ ప్రోపర్‌గైట్ లేక పైరోమేసిన్ 1.25 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపడుతూనే క్రమం తప్పకుండా నీటి తడులు ఇస్తే మామిడిలో పూత, పిందె రాలకుండా ఉంటుంది. దీంతో దిగుబడులు పెరిగి నష్టాలను నివారించుకోవచ్చని ఉద్యాన వన అధికారులు తెలుపుతున్నారు.

కల్యాణం.. కమనీయం

చెంగోల్‌లో వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



ఉత్సవమూర్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం స్థానిక మల్లికార్జున స్వామి ఆలయ 23వ వార్షికోత్సవంలో భాగంగా శివ పార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్ల జ్యోతి, విష్ణుమూర్తి, ఎర్రమల్లి రాజేశ్వరి, సురేష్ దంపతులు కల్యాణ క్రతువును జరిపించారు. ఈశ్వరమ్మ, పండరయ్య అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మేఘమాల, గోపాల్‌రెడ్డి, హన్మయ్య, వెంకటేశం, రాముయాదవ్, శ్రీనివాస్, నరేష్, కరుణాకర్‌రెడ్డి, పులిందర్‌చారి, విష్ణుచారి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి

పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి



అగ్గనూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం మండలంలోని అగ్గనూరు గ్రామంలో రూ.5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. అవసరమైన చోట సీసీ రోడ్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అడిగిన వెంటనే నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మాజీ ఎంపీటీసీ గరివప్ప, మాజీ సర్పంచ్ భీమప్ప, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేందర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవాల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి లింగం, నంది, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రకాష్, రవి, సతీష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలపై ఎమ్మెల్యే ఆగ్రహం

తాండూరు: తాండూరు పట్టణంలో ఇళ్లలోకి చొరబడి వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసు అధికారులు ఏం చేస్తున్నారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని సాయిపూర్, గ్రీన్ సిటీ కాలనీలలో బంగారం, నగదు చోరీకి గురైన రెండిళ్లకు చెందిన బాధితులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు విధిగా గస్తీ నిర్వహించాలని సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై నిఘా పెట్టాలన్నారు. ఇళ్లను చోరీ చేసిన దొంగలను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే పోలీసు అధికారులను ఆదేశించారు.

పార్కు స్థలంపై ఇరువర్గాల ఘర్షణ

మీర్‌పేట: పార్కు స్థలం విషయమై జరిగిన గొడవలో మీర్‌పేట పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. జిల్లెలగూడ శక్తినగర్ కాలనీలోని 350 గజాల పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం యజమానిని అడ్డుకున్నారు. దీంతో కాలనీ ప్రతినిధులు, యజమాని అనుచరుల మధ్య గొడవ జరిగింది. ఈ మేరకు ఇరువురు పీఎస్‌లో ఒకరిపై ఒక రు ఫిర్యాదులు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు. త

సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

ఘనంగా పీఆర్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవం

యాలాల: పీఆర్‌టీయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం సంఘ సభ్యుల సమక్షంలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు ఇందోలు శ్రీధర్‌రెడ్డి, యాలాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, రాములు తదితరుల సమక్షంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 1971 సామల యాదగిరి సంఘాన్ని స్థాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. సంఘ నాయకులు విజయ్‌కుమార్, పరమేష్, మురహరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఇంట్లోనే ఉరేసుకున్న మహిళ



లక్ష్మి (ఫైల్)

దౌల్తాబాద్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవిగౌడ్ వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన అయిలపు వెంకటప్పకు 15 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం రెబ్బన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మి(32)తో వివాహం జరిగింది. వీరు వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం ఇంట్లో భార్యాభర్తల మధ్య చిన్న పాటి కలహాలు చోటు చేసుకున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త తలుపు తీయడానికి ప్రయత్నించగా ఎంతకూ రాకపోవడంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చాడు. తలుపు తీసి చూడగా ఉరేసుకొని విగతజీవిగా పడి ఉంది. మృతురాలి తండ్రి చంద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడ మృతి



లేగదూడ కళేబరం

దోమ: గుర్తు తెలియని జంతువు దాడిలో ఓ లేగదూడ మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని దొంగఎన్కేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లిసాయిబాబా శనివారం రాత్రి పొలం దగ్గర తన షెడ్డులో పశువులు, లేగదూడలను ఎప్పటిలాగే కట్టేసి ఇంటికి వచ్చారు. అయితే ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన కట్టేసి ఉంచిన ఓ లేగదూడపై గుర్తు తెలియని జంతువు దాడికి పాల్పడడంతో మృత్యువాత పడినట్లు గుర్తించారు. వెంటనే స్థానికుల సహాయంతో ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా, ఏ జంతువు దాడికి పాల్పడిందో గుర్తించే పనిలో వారు నిమగ్నమయ్యారు. కాగా, లేగదూడను చంపింది ఓ క్రూర జంతువు అయి ఉంటుందని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జీవనోపాధి కోసం తెచ్చుకున్న పశువులపై గుర్తు తెలియని జంతువు దాడికి పాల్పడడం తమకు ఎంతో ఆందోళన కలిగిస్తుందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి దాడికి పాల్పడిన జంతువును గుర్తించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కోట్‌పల్లి.. కేరింతల కడలి

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్దకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ఆదివారం కావడంతో కుటుంబసభ్యులతో చేరుకొని సందడి చేశారు. అడవి, ప్రాజెక్టు అందాలను ఆస్వాదించారు. అనంతరం కేరింతలు కొడుతూ మైమరచి పోయారు. యువత బోటింగ్ చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఎంజాయ్ చేశారు.

– ధారూరు



ఫొటోకు ఫోజులిస్తున్న బాలిక



ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న యువత

పల్లెల్లో పంచాయతీ సందడి

పంచాయతీ, పరిషత్ ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది. స్థానిక సమరంలో ఎలాగైనా సత్తా చాటాలని ఆశావహులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. మరో కొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. కానీ రిజర్వేషన్లు తేలకపోవడంతో కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అవి ఎలా వచ్చినా వాటికి అనుగుణంగా ముందుకు సాగే యత్నాలు చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం

వేడెక్కుతున్న రాజకీయం

- గెలుపు ధీమాల్లో అధికార పార్టీ
- పట్టు సాధించేందుకు కారు కసరత్తు
- మోదీ నామంతో కమలనాథులు



ఇబ్రహీంపట్నం: స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 15వ తేదీ లోపు వెలువడుతుందన్న ప్రకటనతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఆశావహులంతా పల్లెబాట పడుతున్నారు. బడా నేతలు తమ ఉనికి చాటుకునేందుకు యత్నిస్తున్నారు. 2024 జనవరి 31తో సర్పంచి, 2024 జులై 4తో ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన సంగతి తెలిసిందే. నాటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే పార్లమెంటు ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. కానీ అధికార పార్టీ కాంగ్రెస్ ఎటూ తేల్చక కాలయాపన చేస్తూ వచ్చింది. అయితే ఇటీవల చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తుండటం, ఎన్నికలకు వెళ్తున్నట్లు ప్రభుత్వం నుంచి సానుకూల సంకేతాలు రావడంతో రాజకీయ పార్టీలు.. ఎన్నికల కసరత్తుకు సమయాత్తం అవుతున్నాయి.

పై'చేయి' మనదే

అధికారంలో ఉన్నాం.. అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కాబట్టి స్థానిక ఎన్నికల్లో తమదే పైచేయి ఉంటుందన్న ఆశతో కాంగ్రెస్ పార్టీ ఉంది. కానీ.. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంలో వెనుకబడివుంది. గ్రామ, మండల స్థాయిలో ఎలాంటి సమావేశాలను నిర్వహించిన దాఖలాలు లేవు. కార్యకర్తలను, నేతలను ప్రోత్సహించే కార్యక్రమాలు ఇప్పటి వరకు చేపట్టలేదు. అధికార కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొనడం తప్ప.. ఎన్నికల పోరుపై పూర్తి స్థాయి ఫోకస్ పెట్టలేదు.

పట్టుకోసం కారు కసరత్తు

పల్లెల్లో పట్టు నిలుపుకొనేందుకు బీఆర్‌ఎస్ తీవ్ర కసరత్తు చేస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గులాబీ శ్రేణులతో సమాయత్తం అవుతున్నారు. విస్తృతస్థాయి సమీక్షలు నిర్వహించి, కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలో లేమన్న భావనను కార్యకర్తల్లో నుంచి తొలగించి, స్థానిక ఎన్నికల్లో కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ముమ్మర యత్నాలు చేయడంలో బీఆర్‌ఎస్ ముందంజలో ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వచ్చిన తీవ్ర వ్యతిరేకతే.. బీఆర్‌ఎస్‌కు కలిసి వస్తుందన్న ధీమాల్లో ఆ పార్టీ శ్రేణులున్నారు.

సంక్షేమ కార్యక్రమాలే రక్ష

స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఇంకా స్తబ్దుగానే ఉంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక చేపట్టలేదు. ఆ పార్టీకి ముందు నుంచి ఉన్న భావజాలంతో పాటు ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే తమకు రక్షగా ఉంటాయని కమలనాథులు భావిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారిగానే ఓట్లను దండుకుంది. ఆ పట్టును ఈ స్థానిక సమరంలో నిలుపుకొంటుందా లేదా అనేది వేచి చూడాల్సిందే!

కమ్యూనిస్టులు ఉద్యమాలకే పరిమితం

కమ్యూనిస్టు పార్టీలైన సీపీఐ, సీపీఎంలు ప్రజా సమస్యలపై పోరాటాలకే పరిమితమయ్యాయి. ప్రజల్లో ఆ పార్టీకి పట్టు చిక్కడంలేదు. స్థానిక ఎన్నికల్లో పట్టు సాధిస్తుందనే నమ్మకం లేకపోయినా.. అభ్యర్థుల గెలుపోటములను కొన్నిచోట్ల శాసించే అవకాశం లేకపోలేదు.

ఓటర్లు 31,662

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 14 గ్రామ పంచాయతీలు, 10 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తాజా ఓటర్ల జాబితా ప్రకారం 31,662 మంది ఉన్నారు. అందులో పురుషులు 15,719 మంది, మహిళలు 15,941 మంది, ఇతరులు ఇద్దరున్నారు.

రిజర్వేషన్ల తర్జనభర్జన

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల కారణంగా రిజర్వేషన్ల మార్పు అనివార్యం అయింది. తాజాగా కులగణన సర్వే పూర్తి కావడంతో రిజర్వేషన్లు మారుతాయన్న తర్జనభర్జన జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల ఎస్సీ,ఎస్టీ, బీసీల జనాభాను బట్టి రిజర్వేషన్లపై నేతలు అంచనాలు వేసుకుంటున్నారు.